RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | ఆదివారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 95 | మార్చి 02, 2025 | వెల : రూ.3-00

www.vedhanews.in

**విలేకరులు కావలెను**

ప్రజా సమస్యల పరిష్కారమే మా ఎజెండా..ఇంత కాలం మేము ప్రచురించిన కథనాలే అందుకు ఉదాహరణ..
నిజమైన, నిఖార్సైన జర్నలిజానికి వేదికగా నిలుస్తున్న 'వేద న్యూస్' తెలుగు దినపత్రికలో నిజాలు రాసి నిఖార్సైన జర్నలిస్టుగా రాణించాలనుకునే వారికి ఇదే మా ఆహ్వానం..

9701923260, 9701920379

# త్వరగా.. భూ సేకరణ చేయండి




## వరంగల్ విమానాశ్రయం ఎక అసెట్ గా ప్రతిష్టాత్మకంగా నిర్మాణం ఉండాలి

## ఉన్నత స్థాయి సమీక్షలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి

**వేద న్యూస్, హైదరాబాద్ :**

వరంగల్ మామునూరు విమానాశ్రయం కేరళ కొచ్చి విమానాశ్రయం తరహాలో ఉండాలని, ప్రతి నిత్యం రాకపోకలతో విమానాశ్రయంలో కార్యకలాపాలు జరిగేలా డిజైన్ రూపకల్పన జరగాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. వరంగల్ నగరానికి విమానాశ్రయం ఎక అసెట్‌గా ప్రతిష్టాత్మకంగా నిర్మాణం ఉండాలని చెప్పారు. విమానాశ్రయ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చిన నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ నివాసంలో శనివారం ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు. విమానాశ్రయానికి సంబంధించి భూసేకరణ, పెండింగ్ అంశాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సాధ్యమైన తొందరగా భూ సేకరణ ప్రక్రియను పూర్తి చేసి డిజైనింగ్ కు పంపించే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విమానాశ్రయ నిర్మాణానికి సంబంధించి ఎప్పటికప్పుడు సమీక్షలు చేస్తూ ప్రతి నెల తనకు ప్రగతి నివేదిక అందించాలని అన్నారు. కాగా మామునూరు విమానాశ్రయానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చేలా కృషి చేసిన సీఎంకి ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర నేతలు ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో మంత్రులు కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, కొండా సురేఖ, ధనసరి అనసూయ సీతక్క, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంపీలు కావ్య, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్ రెడ్డి, కేఆర్ నాగరాజు,నాయిని రాజేందర్ రెడ్డి, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారితో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీ నుంచి తీన్మార్ మల్లన్న సస్పెండ్

**వేద న్యూస్, డెస్క్:**

కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను సస్పెండ్ చేసింది. ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ తెలిపింది. పార్టీ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నారన్న కారణంతో తీన్మార్ మల్లన్నకు ఫిబ్రవరి 5న టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఫిబ్రవరి 12లోపు వివరణ ఇవ్వాలని అందులో పేర్కొంది. ఆయన నుంచి ఎలాంటి వివరణ రాలేదు. ఈ నేపథ్యంలో పార్టీ నుంచి మల్లన్నను సస్పెండ్ చేస్తూ క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి పేరిట శనివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. కాగా తీన్మార్ మల్లన్న సస్పెండ్ వ్యవహారంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. కుల గణనకు సంబంధించిన పత్రాలను తగుల బెట్టడం తీవ్రంగా పరిగణించామని పేర్కొన్నారు. పీసీసీ క్రమశిక్షణ కమిటీ ఇచ్చిన షోకాజ్ నోటీస్‌కు మల్లన్న నుంచి సమాధానం రాలేదని, అన్ని అంశాలు పరిశీలించిన తర్వాతే క్రమశిక్షణ కమిటీ మల్లన్నపై సస్పెండ్ వేటు వేసిందని తెలిపారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు ఎవరు పాల్పడినా చర్యలు తప్పవని హెచ్చరించిన ఆయన, వ్యక్తుల స్థాయికి, ప్రాంతాలకు, కులాలకు, మతాలకు సంబంధం ఉండదని స్పష్టం చేశారు.

# చెప్పాడు.. చేశాడు..

- మాట నిలబెట్టుకున్న మంత్రి పొంగులేటి
- 'పాలేరు'కు మహర్దశ
- రూ.45.50కోట్ల వ్యయంతో 100పడకల ప్రభుత్వ ఆసుపత్రి మంజూరు
- మంత్రి చొరవతో జీవో ఆర్ టీ నెం. 68 విడుదల చేసిన ప్రభుత్వం
- హర్షం వ్యక్తం చేస్తున్న పాలేరు నియోజకవర్గ ప్రజలు



**వేద న్యూస్, పాలేరు :**

తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో పాలేరు నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకువెళ్తుంది. ఇప్పటికే ఇంజనీరింగ్ కళాశాలకు నూతన భవనం..కూసుమంచిలో కొత్త జూనియర్ కళాశాల..ఖమ్మం రూరల్ మండలం పెద్దతండాలో నర్సింగ్ కళాశాల.. పొన్నెకల్ లో సమీకృత రెసిడెన్షియల్ పాఠశాల..నియోజకవర్గంలోని ఆయా ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు.. ఏదులాపురం మున్సిపాలిటీ ఏర్పాటు..ఇలా చెప్పుకుంటూ పోతే గడిచిన 15 నెలల కాలంలో పాలేరు నియోజకవర్గం అభివృద్ధిలో పరుగులు పెడుతుంది. పాలేరు నియోజకవర్గ అభివృద్దే లక్ష్యంగా అడుగులు వేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తాజాగా కూసుమంచి కేంద్రంగా 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని మంజూరు చేయించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజలకు 100పడకల ఆసుపత్రి మంజూరు చేయిస్తానని ఇచ్చిన హామీ మేరకు మంత్రి పొంగులేటి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 15 నెలల కాలంలోనే హామీని నెరవేర్చారు. అందులో భాగంగానే ఫిబ్రవరి 24వ తేదీన రూ.45.50కోట్ల వ్యయంతో 100పడకల ఆసుపత్రిని మంజూరు చేస్తూ జీవో ఆర్ టి నెం.68 రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. దీంతో పాలేరు నియోజకవర్గ ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందనున్నాయి. ఆసుపత్రిని మంజూరు చేయించిన మంత్రి పొంగులేటికి పాలేరు నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

## జాతి భవిష్యత్తు కోసం మాదిగ బిడ్డలు ప్రాణాలు అర్పించారు

- ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మాదిగ అమర వీరుల సంస్మరణ దినోత్సవం
- మాదిగ అమర వీరుల చావుకు కారణం కాంగ్రెస్ పార్టీ
- మంద కుమార్ మాదిగ

**వేద న్యూస్, హన్మకొండ :**

ఆగస్టు 1న ఎస్సీల వర్గీకరణకు కనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో వర్గీకరణ పోరాటం విజయం సాధించిందని అది మాదిగ అమర వీరులకు అంకితమిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ తెలిపారని ఎమ్మెస్పీ జాతీయ నేత మంద కుమార్ మాదిగ అన్నారు. శనివారం హనుమకొండ అంబేద్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మాదిగ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు గద్దల సుకుమార్ మాదిగ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఎస్పి జాతీయ నేత మంద కుమార్ మాదిగ మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో ఎస్సీల వర్గీకరణ కోసం జరుగుతున్న పోరాటంలో మాదిగ బిడ్డలు తమ ప్రాణాలు జాతి భవిష్యత్తు కోసం అర్పించారని ఆ అమరుల త్యాగాల ఫలితంగా నేడు వర్గీకరణ సాధించామని అన్నారు. ప్రాణ త్యాగం చేసిన అమరులను త్యాగాలను గుర్తు చేసుకుంటూ ప్రతి సంవత్సరం మార్చి ఒకటి న మాదిగ అమర వీరుల సంస్మరణ దినోత్సవం జరుపుతామని ఆయన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మంత్రి దామోదర రాజనర్సింహ ఆధ్వర్యంలో జరిగిన మాదిగ అమర వీరుల సంస్మరణ ఎలా ఉందంటే సంపినోడే సంతాప సభ పెట్టినట్టున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాదిగ అమర వీరుల చావుకు కారణం కాంగ్రెస్ పార్టీ అని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పి జాతీయ నేతలు వేల్పుల సూరన్న మున్నూరు కాపు,బొడ్డు దయాకర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జన్ను దినేష్ మాదిగ,ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు గద్దల సుకుమార్ మాదిగ, ఎంఎస్పి జిల్లా అధ్యక్షులు బండారి సురేందర్ మాదిగ, ఎంఎస్పి రాష్ట్ర నాయకులు మంద రాజు మాదిగ,ఎంఈఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జ్ మంద చిన్నరాజు మాదిగ,ఎంవైఎస్ జాతీయ నాయకులు పుట్ట బిక్షపతి మాదిగ, చాతల్ల శివ మాదిగ, ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి నాయకులు అక్కెనకుంట వెంకటస్వామి మాదిగ, సుంచు రజిని కుమార్ మాదిగ, జరిపోతుల సారంగపాణి మాదిగ, రాజారపు కిరణ్ మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు బొక్క రాజేష్ మాదిగ,సిలువేరు బిక్షపతి మాదిగ, రేణుకుంట్ల రాజేందర్ మాదిగ,మంద వర్ధన్ మాదిగ,ఎర్ర రాము మాదిగ,సందీప్ మాదిగ, కంజర్ల మధుకర్ మాదగ తో పాటు ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## చారిత్రక వీరులను స్మరించటం ప్రతి భారతీయుడి బాధ్యత

- తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య బాల కిష్టారెడ్డి



వేద న్యూస్, హైదరాబాద్

4లో..

# అంతు పట్టని జగన్ స్ట్రాటజీ



విజయవాడ : అనర్హత భయమే వైసీపీని అసెంబ్లీకి తీసుకొచ్చిందా.. అందుకే ఒక్కరోజు సమావేశాలకు మాత్రమే పరిమితం అయ్యారా.. అదే నిజం అయితే మళ్లీ ప్రతిపక్ష హోదా నినాదం ఎందుకు.. అసెంబ్లీలో జగన్ ఎపిసోడ్‌పై జరుగుతున్న చర్చ ఏంటి?కూటమి అధికారంలోకి వచ్చాక.. ఎప్పుడూ లేనంత ఆసక్తి రేపాయ్ ఈసారి అసెంబ్లీ సమావేశాలు. ప్రతిపక్ష హోదా ఇస్తేనే సభకు వస్తానని.. లేదంటే ప్రెస్ మీట్ పెట్టి ప్రశ్నిస్తూ ఉంటానని చెప్పిన జగన్.. బడ్జెట్ సమావేశాలకు హాజరు కావడమే దీనికి కారణం. సభకు వచ్చిన జగన్.. ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు.. గవర్నర్ ప్రసంగం జరుగుతున్న సమయంలో ఆందోళనకు దిగారు.పోడియం ఎదుట.. ప్రతిపక్ష పార్టీ హోదా ఇవ్వాలని నినాదాలు చేశారు. కొద్దిసేపు నిరసనలు చేసిన తర్వాత.. ప్రభుత్వం తీరు, గవర్నర్ స్పీచ్?కు నిరసనగా సభ నుంచి వాకౌట్ చేశారు. సభకు వచ్చినట్లే వచ్చిన జగన్.. 20 నిమిషాల్లోనే పార్టీ సభ్యులతో కలిసి వాకౌట్ చేయటం కొత్త చర్చకు కారణం అయింది. జగన్ అలా వచ్చి ఇలా వెళ్లడం ఇప్పుడు రాజకీయ రచ్చకు కారణం అవుతోంది. భయంతోనే జగన్ అసెంబ్లీకి వచ్చారంటూ అధికార పార్టీ నేతలు ఓ రేంజ్‌లో టార్గెట్ చేస్తున్నారు.నిజానికి అసెంబ్లీకి వైసీపీ హాజరుపై.. కొంతకాలంగా భారీ మాటల యుద్ధం జరుగుతోంది. స్పీకర్ చైర్‌లో డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు ఉండగా.. జగన్‌ను సభలో కూర్చొబెట్టాలని అధికార ఆశపడుతుంది అనడంలో ఎలాంటి అనుమానం లేదు. ఐతే తనకు ప్రతిపక్ష హోదా ఇస్తేగాని సభకు రానంటూ జగన్ డిమాండ్ చేస్తున్నారు.దీంతో అధికార పార్టీ సరికొత్త అస్త్రాన్ని తెరమీదకు తీసుకవచ్చింది. 60 రోజులు సభకు రాకపోతే.. చట్టప్రకారం ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేస్తామని స్పీకర్ అయ్యన్నతో పాటు.. డిప్యూటీ స్పీకర్ రఘురామ వార్నింగ్ ఇచ్చారు. 11 మంది వైసీపీ ఎమ్మెల్యేలు అనర్హత ప్రమాదం నుంచి బయటపడాలంటే.. సభకు వచ్చి తీరాల్సిందేనని తేల్చి చెప్పారు.దీంతో రాజకీయం రసవత్తరంగా కనిపించింది. ఇలాంటి పరిణామాల మధ్య జగన్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఎమ్మెల్యేలతో కలిసి అసెంబ్లీకి హాజరై.. ప్రతిపక్ష హోదా నినాదం వినిపించి వెళ్లిపోయారు. జగన్ తీరుపై ఇప్పుడు అధికార పార్టీ మాటల యుద్ధం మొదలు పెట్టింది. 60రోజుల పాటు అసెంబ్లీకి రాకపోతే సభ్యత్వం కోల్పోతామనే భయంతోనే.. జగన్‌తో పాటు వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వచ్చి సంతకాలు చేసి వెళ్లిపోయారంటూ టార్గెట్ చేస్తున్నారు.ప్రజాసమస్యల గురించి మాట్లాడకుండా ప్రతిపక్ష హోదా అడగడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఐదేళ్లలో ప్రతిపక్ష హోదా రాదని వైసీపీ నేతలు ఫిక్స్ అయితే బెటర్ అంటూ పవన్ కల్యాణ్ సెటైర్లు వేశారు. ఓవరాల్‌గా జగన్ రాక.. ఇప్పుడు ఏపీ రాజకీయాలను మరింత ఇంట్రస్టింగ్‌గా మార్చింది. ఇక అసెంబ్లీ నుంచి వాకౌట్ చేసిన తర్వాత.. పార్టీ నేతలతో తాడేపల్లిలో భేటీ అయిన జగన్.. ప్రతిపక్షహోదా ఇచ్చే ఆలోచన ప్రభుత్వానికి లేదని.. అసెంబ్లీకి వెళ్లడం కంటే.. జనాల్లోకి వెళ్లి పోరాడడం బెటర్ అని నేతలకు సూచించారు. అసెంబ్లీలో సంతకాలు చేసి.. అనర్హత పడకుండా వైసీపీ నేతలు జాగ్రత్త పడ్డారని.. ఇదంతాభయమే అని అధికార పార్టీ నేతలు వైసీపీటార్గెట్‌గా విమర్శలు గుప్పిస్తున్నారు. ఆ భయంతోనే ఒక్కరోజు సమావేశాలకు మాత్రమే పరిమితం అయ్యారని.. ఇకపై హాజరుకానని చెప్పేది అందుకే అంటున్నారు.ఏమైనా ఏపీ అసెంబ్లీ రూల్స్ చుట్టూ తిరిగిందీ రెండు రోజులు. 60రోజులు వరుసగా హాజరుకాకపోతే రూల్స్ ప్రకారం సభ్యత్వం రద్దవుతుందని వైసీపీని అధికార పార్టీ సభకు రప్పిస్తే.. ఒక్కరోజు అలా వచ్చి సంతకాలు చేసి.. ఇక రామని చెప్పి అదే రూల్స్‌ను ఆయుధంగా వాడుకుంది వైసీపీ అనే గుసగుసలు వినిపిస్తున్నాయ్. సభకు వచ్చినట్లే వచ్చి.. వాకౌట్ చేసి జగన్ తన స్ట్రాటజీ ఏంటూ ప్రూవ్ చేసుకున్నారన్నది మరికొందరి అభిప్రాయం. అసెంబ్లీ సమావేశాలు మరీ ఇంత ఆసక్తిగా ఉంటాయని అనుకోలేదంటూ చర్చ మొదలుపెట్టారు.. ఈ వ్యవహారం అంతా చూసినవాళ్లు.

# ఓ వైపు రాజీనామాలు..మరో వైపు ఒత్తిళ్లు

కడప : నేతల వరుస రాజీనామాలు ఓవైపు టెన్షన్ పెడుతుంటే.. ఉన్న నాయకుల్లో ఆధిపత్య పోరు వైసీపీని మరింత కార్నర్ అయ్యేలా చేస్తోంది. మిగతా చోట్ల ఎలా ఉన్నా.. సొంత జిల్లాలోనే ఫ్యాన్ రెక్కలు చప్పుడు చేస్తున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయ్. లీడర్లను కాపాడుకోవడానికి జగన్..చాలా కష్టపడుతున్నారనే ప్రచారం జరుగుతోంది. జమ్మలమడుగులో కీలక నేతలు ఒకరిపై ఒకరు సాకులు చెప్పుకుంటూ పార్టీని డైలమాలో పడేస్తున్నారట. జమ్మలమడుగు రగడకు చెక్ పెట్టకపోతే ఉన్న పార్టీ కేడర్ జారుకునే పరిస్థితి కనిపిస్తోంది. మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి మధ్య.. జమ్మలమడుగు జగడం నడుస్తోంది. జగన్ ఎన్నిసార్లు సర్దిచెప్పినా.. పరిస్థితి మళ్లీ మొదటికే వస్తోందనే గుసగుసలు వినిపిస్తున్నాయ్.ఆ మధ్య సుధీర్ రెడ్డి, రామసుబ్బారెడ్డి మధ్య సయోధ్య కుదిర్చిన జగన్.. జమ్మలమడుగులో చెరో మూడు మండలాలు చూసుకోమని చెప్పి పంపించారు. ఎవరికి కేటాయించిన మండలాల్లో.. అప్పటి నుంచి వాళ్లు కార్యక్రమాలు చేసుకుంటూ వస్తున్నారు. ఐతే కొద్దిరోజుల పాటు అంతా బాగానే ఉంది. ఇన్నాళ్లు సైలెంట్‌గా ఉన్న మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి.. ఇప్పుడు జమ్మలమడుగు పార్టీ కార్యాలయానికి తరచుగా వస్తున్నారు. ఇదే మరోసారి చర్చకు దారి తీస్తుంది. మరోవైపు ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి పార్టీ కార్యక్రమాలతో పాటు? రైతు నిరసనలను అజెండాగా పెట్టుకుని తనకు కేటాయించిన మండలాల్లో పార్టీ బలోపేతం దిశగా ముందుకు వెళ్తున్నారు. ఇప్పుడు సుధీర్ రెడ్డి రాకతో వైసీపీ కేడర్ కన్ఫ్యూజన్‌లోకి వెళ్తున్నట్టు టాక్.రామసుబ్బారెడ్డికి కేటాయించిన మండలాల్లో.. ఇప్పుడు సుధీర్ రెడ్డి పర్యటించడం కొత్త చర్చకు దారి తీస్తోంది. లోకల్‌గా ఫ్యాన్ పార్టీకి ట్రబుల్ క్రియేట్ చేస్తోంది. సుధీర్‌రెడ్డి మీద వ్యతిరేకంతో ఉన్న కొందరు నేతలు.. ఎవరి దారి వారు చూసుకునేందుకు కూడా రెడీ అవుతున్నారట. వైసీపీ నుంచి జంప్ అయ్యే ప్రయత్నాలు కూడా మొదలుపెట్టారని ప్రచారం జరుగుతోంది. రామ సుబ్బారెడ్డి అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొనడానికి వెళ్లారు. ఇలాంటి టైమ్‌లో జమ్మలమడుగులో సుధీర్ రెడ్డి పర్యటించగా.. ఈ విషయాలను పార్టీ కేడర్ జగన్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. తమకు ఒక్క లీడర్‌ను కేటాయించాలని కోరినట్లు టాక్. దానికి కొంత టైమ్ పడుతుందని.. త్వరలోనే అన్నీ సెట్ అవుతాయని చెప్పి వాళ్లను జగన్ తిరిగి పంపించినట్లు తెలుస్తోంది.ఏమైనా జమ్మలమడుగు ఆధిపత్య జగడం.. ఇప్పుడు వైసీపీని ప్రమాదంలో పడేసేలా ఉందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయ్. సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించకపోతే.. పార్టీ కేడర్ చేయి జారిపోయే ప్రమాదం ఉందనే హెచ్చరికలు వినిపిస్తున్నాయ్.

# తగ్గేదెలా... వైసీపీపై పవన్ యాక్షన్

విజయవాడ : పవన్‌తో పెట్టుకుంటే ఏమవుతుందో.. పవన్ రంగంలోకి దిగితే ఎలా ఉంటుందో చెప్పడానికి.. అసెంబ్లీ సాక్ష్యంగా మారింది. ఒక్కో మాట.. ఒక్కో తూటాలా వినిపించింది. స్వరం మారేదే లేదు.. స్టాండ్‌లో మార్పు లేదు అన్నట్లుగా ఫ్యాన్ పార్టీని చెడుగుడు ఆడుకున్నారు పవన్. పొత్తుల నుంచి అసెంబ్లీలో వైసీపీ ఎత్తుల వరకు.. కొన్నింటికి క్లారిటీ, ఇంకొన్నింటికి తన మార్క్ వార్నింగ్ ఇచ్చారు. సేనాని ఈజ్ బ్యాక్ అనిపించారు.వైసీపీ, పవన్ యుద్ధం.. ఎప్పటికీ చల్లారనిది! అదే అనిపించింది అసెంబ్లీ సమావేశాల్లో డిప్యూటీ సీఎం మాటలు వింటే. నిజానికి ఎన్నికల ముందు ఫ్యాన్ పార్టీని పవన్.. అంశాలవారీగా చీల్చి చెండాడారు. డిప్యూటీ సీఎం అయ్యాక.. పాలనపై మీదే ఫోకస్ పెట్టి తన పని తాను చేసుకోపోతున్నారు. ఐతే వైసీపీ నుంచి మాత్రం విమర్శలు ఆగలేదు.కూటమిలో లుకలుకలు స్టార్ట్ అయ్యాయని.. పవన్ దూరం జరుగుతున్నారంటూ సోషల్‌మీడియా వేదికగా వైసీపీ ప్రచారం మొదలుపెట్టింది. ఐతే వాటిపై ఇన్నాళ్లు మౌనంగా ఉన్న పవన్.. అసెంబ్లీ సాక్షిగా విరుచుకుపడ్డారు. పాత పవన్‌ను గుర్తు చేశారు. అదే ఫైర్.. అదే దూకుడు.. తగ్గేదే లే, తగ్గింది లే అన్నట్లుగా పవన్ మాటలు వినిపించాయ్.అసెంబ్లీ సమావేశాల మొదటిరోజు 20 నిమిషాలు మాత్రమే సభకు హాజరైన వైసీపీ ఎమ్మెల్యేలు.. గందరగోళం క్రియేట్ చేశారు. స్పీకర్ పోడియం ఎదుట నిరసన తెలపడంతో పాటు.. గవర్నర్ ప్రసంగాన్ని అడ్డగించే ప్రయత్నం చేశారు. ఆ తర్వాత సభ నుంచి వాకౌట్ చేశారు. సభలో జగన్ తీరుపై.. పవన్ తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు.ప్రతిపక్ష హోదా రాదని ఫిక్స్ అవ్వాలంటూ చురకలు అంటించారు. దీనిపై వైసీపీ రియాక్ట్ అవగా.. శాసనసభ వేదికగా పవన్ ఫైర్ అయ్యారు. వైసీపీ సభ్యుల తీరు చూస్తే టెర్రరిజం గుర్తుకు వచ్చిందంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. పేరెత్తి చెప్పకపోయినా.. వైసీపీ ప్రతీ మాటకు కౌంటర్ ఇచ్చారు. పవన్ మాటలు.. ఫ్యాన్ పార్టీకి తగలాల్సినచోట తగినట్లు అనిపించాయ్.వైసీపీ చేసిన రచ్చకు తాను క్షమాపణ చెప్తున్నానంటూ.. ఫ్యాన్ పార్టీని దిమ్మతిరిగే షాక్ ఇచ్చారు పవన్. ఇది రాజకీయంగా జనసేనకు కలిసివచ్చే అవకాశాలు లేకపోలేదు. కూటమి విషయంలో స్ట్రాంగ్ స్టేట్‌మెంట్ ఇచ్చారు. పదేళ్లు కూటమిగానే ఉంటాం.. అధికారం తమదే అన్న పవన్ ఇప్పుడు మరో ఐదేళ్లు పెంచారు.కూటమి ప్రభుత్వం 15ఏళ్లు కొనసాగుతుందని చెప్పారు. ఎవరెవరో ఏదేదో మాట్లాడుతున్నారని.. ఏదీ పట్టించుకోమని అన్నారు. కూటమిలో లుకలుకలు అంటూ వైసీపీ చేస్తున్న ప్రచారానికి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ఎన్ని కష్టాలు వచ్చినా.. కలిసే ఉంటామని కూటమిని నిలబెడతామని హామీ ఇచ్చారు.వైసీపీ విషయంలో ఎప్పటికీ తగ్గేదే లే అన్నట్లు పవన్ మాటలు వినిపించాయ్. ఎన్నికల ప్రచారంలో వైసీపీని నిలదీసిన పవన్.. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక కూడా అదే కంటిన్యూ చేస్తున్నారు. ప్రజావేదికల కూల్చివేతల నుంచి.. అమరావతి రైతులపై దాడు, చంద్రబాబు జైలు, కల్తీ లడ్డూ వరకు ప్రతీ విషయాన్ని ప్రస్తావిస్తూ.. ఫ్యాన్ పార్టీని ఓ ఆట ఆడుకున్నారు పవన్ కల్యాణ్.వైసీపీ విషయంలో ఏ విషయం మర్చిపోయేది లేదని.. అన్నింటినీ నిలదీస్తాం, కడిగేస్తాం అన్నట్లుగా కనిపిస్తున్నారు. రాజకీయ వైరం మాత్రమే కాదు.. అంతకుమించి అన్నట్లుగా వైసీపీ మీద పవన్ యుద్ధం చేస్తున్నారా అనిపిస్తోంది కొన్నిసార్లు ! చంద్రబాబు అయినా వైసీపీ విషయంలో అంతో ఇంతో మౌనం వహిస్తున్నారేమో కానీ.. పవన్ మాత్రం అలా కనిపించడం లేదు.



# విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

**వేద న్యూస్, వేములపల్లి :**

వేములపల్లి మండల కేంద్రంలోని ఆమనగల్లు జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం ఉదయం స్వపరిపాలన దినోత్సవము ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు యోగిశ్వర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం నిర్వహించడం వలన విద్యార్థులలో సృజనాత్మకతను వెలికి తీయుటకు దోహదపడుతుందన్నారు. విద్యార్థులకు కూడా సమాజంలో ఎలా వ్యవహరించాలో తెలిసి వస్తుందని, నిజ జీవితంలో ఇలాంటి స్థాయిలకు కూడా ఎదగాలని ఒక ఆలోచన, దృక్పథం, పట్టుదల, విద్యార్థుల మనసులో నాటుకు పోతుందని తెలిపారు. ఈ ఒక్కరోజు పాత్రలో విద్యార్థులు పీఎం, సీఎం మంత్రులుగా, కలెక్టర్, డీఈవో, ఎంఈఓ, ప్రిన్సిపల్, వివిధ వేషధారణలో పాఠశాలకు పెద్ద ఎత్తున కాన్వాయ్‌లో రావడంతో పాఠశాల పరిసర ప్రాంతాలు సందడిగా మారాయి. ఈ స్వపరిపాలన దినోత్సవ కార్యక్రమంలో కొంతమంది విద్యార్థులు ప్రధానమంత్రిగా సిద్ధార్థ, సెంట్రల్ హెూం మినిస్టర్ గా వినిల్,ముఖ్యమంత్రిగా పూజ, ఉప ముఖ్యమంత్రిగా శరణ్య, విద్యాశాఖ మంత్రిగా మానస, కలెక్టర్ గా వైష్ణవి, డీఈవోగా నాగలక్ష్మి,ఎంఈఓ గా మానస, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలుగా త్రివేణి,డిపిడిఓ గా శిరీష, సర్పంచ్ గా ఆకాంక్ష,ఎమ్మార్వో గా సోనియా,ఎంపీడీవో గా నవ్య, ఎంపీవో గా కీర్తి వ్యవహరించారు. విద్యార్థులందరూ ఈ ఒక్కరోజు వివిధ హెూదాల్లో మా పాఠశాలలోనే గడిపినందుకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయబృందం సైదులు, అనంతుల పుల్లయ్య, రవి, అబ్బాస్ , గౌసద్దీన్,శ్రీనివాసు,జయమ్మ, వెంకన్న,పద్మ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిభ పరీక్షలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

**వేద న్యూస్, మిర్యాలగూడ ప్రతినిధి :**



భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నేడు (ఆదివారం) నిర్వహించే నల్లగొండ జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్ కరపత్రం మిర్యాలగూడ పట్టణంలోనీ బకల్ వాడి హైస్కూల్ లో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా విడుదల చేయడం జరిగింది. అనంతరం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం ఎప్పుడు ధర్నాలు ఆందోళనలు బంద్ లు కాకుండా పదో తరగతి విద్యార్థులకు మొదటిసారి రాసే కామన్ ఎగ్జామ్ కు విద్యార్థులలో ఉన్న భయాన్ని పోగొట్టేందుకు పదో తరగతి విద్యార్థులకు ప్రతిభా పరీక్షలు పెట్టడం అభినందనీయమన్నారు. ఈ పరీక్షలు పదో తరగతి విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఇప్పటివరకు ఎంత చదివాము ఇంకా ఎంత కష్టపడి చదివితే అనుకున్న లక్ష్యాన్ని నెరవేరెందుకు కృషి చేయాలని ఇలాంటి ప్రతిభా పరీక్షలను సద్వినియోగం చేసుకోవడం వల్ల విద్యార్థులకు ఒక ప్రాక్టీస్ లాగా ఉపయోగపడుతుందని అన్నారు. భవిష్యత్తులో జరిగే పదో తరగతి విద్యార్థుల కామన్ పరీక్షలో విద్యార్థులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా ధైర్యంతో పరీక్షలను రాసి ఉన్నత స్థానాలకు ఎదగాలని కష్టపడి రాకుండా ఇష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ పోటీ ప్రపంచంలో విద్యార్థులు నిలవాలంటే బాగా చదివి ఉన్నత స్థానంలో ఎదిగినప్పుడే విద్యార్థులు చదివిన చదువుకు ఫలితం ఉంటుందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ యొక్క పరీక్షను ప్రభుత్వ ప్రైవేటు విద్యార్థులు హాజరై జిల్లాస్థాయి టాలెంట్ టెస్ట్ పరీక్షను విజయవంతం చేయాలనికొరారు. ఇలాంటి పరీక్షలు నిర్వహిస్తున్న విద్యార్థి సంఘం ఎస్ఎఫ్ఐ ని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కర్నాటి శీను, నెహ్రూ, కే శ్రీనివాస్,సైదా నాయక్,నజీర్ మరియు నాయకులు అఖిల్, బన్నీ వెంకటేష్ ,న్యూ మాన్ లతో పాటు విద్యార్థులు నందిని, పూజ ,హిమ బిందు ,శ్రీవాణి ,గణేష్ ,వర్షిత్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు

- జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు
- ఎస్పీ డివి శ్రీనివాసరావు ఐపీఎస్

**వేద న్యూస్, ఆసిఫాబాద్ :**



కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా శాంతిభద్రతల దృష్ట్యా, ప్రశాంత వాతావరణ పరిస్థితులను మరింత సవ్యంగా కొనసాగించడానికి మార్చి 01 వ తేదీ నుండి మార్చి 31 వ తేది వరకు జిల్లా అంతటా 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు ఐపీఎస్ శనివారం ఓ ప్రకటన లో తెలిపారు. 30 పోలీస్ యాక్ట్-1861 అమల్లో ఉన్నందున జిల్లాలో డిఎస్పి లేదా ఆపై పోలీస్ ఉన్నతాధికారుల నుండి ముందస్తు అనుమతి లేకుండా ఏలాంటి ప్రజా సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు, బహిరంగ సభలు, తదితర ప్రజలు గుమికూడి ఉండేవిధంగా కార్యక్రమాలు నిర్వహించడానికి సన్నాహాలు చేయరాదని తెలిపారు. నిషేధిత ఆయుధాలు, దురుద్దేశంతో నేరాలకు ఉసి కొలిపే ఎటువంటి ఆయుధాలు కల్గి ఉండరాదని అన్నారు. ప్రజా జనజీవనానికి ఇబ్బంది, చిరాకు కల్గించేందుకు దారితీసే ఇబ్బందికర ప్రజా సమావేశాలు, జన సమూహం అలాంటివి పూర్తిగా నిషేధం అన్నారు. చట్టపరమైన జారీచేసిన ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘిస్తే 30 పోలీస్ యాక్ట్ 1861 ప్రకారం శిక్షార్హులు అవుతారని హెచ్చరించారు. నిషేధంలో ఉన్న నిబంధనలను తప్పనిసరిగా అందరూ పాటించాలని సూచించారు.

# ప్రకాశం, పల్నాడులలో బయో గ్యాస్ ప్లాంట్లు

ఒంగోలు : ఆంధ్రప్రదేశ్‌లో రిలయన్స్ ఇండస్ట్రీస్ బయో గ్యాస్ ప్లాంట్ల ఏర్పాటుకు వేగంగా అడుగులు పడుతున్నాయి. తొలి దశలో భాగంగా పల్నాడు, ప్రకాశం జిల్లాలలో రిలయన్స్ బయో గ్యాస్ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఏపీలో కంప్రెస్ట్ బయో గ్యాస్ (సీబీజీ) ప్లాంట్ల ఏర్పాటు గురించి రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ప్రతినిధులు మంగళవారం మంత్రి గొట్టిపాటి రవి కుమార్‌తో చర్చించారు. సచివాలయంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో ఆర్ఐఎల్ ప్రతినిధులు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కంప్రెస్ట్ బయో గ్యాస్ ప్లాంట్ల ఏర్పాటును వేగవంతం చేయాలని రిలయన్స్ ప్రతినిధులను మంత్రి గొట్టిపాటి రవికుమార్ కోరారు. తొలి విడతలో భాగంగా ప్రకాశం, పల్నాడు జిల్లాల్లోని బంజరు భూముల్లో రిలయన్స్ కంప్రెస్ట్ బయో గ్యాస్ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి వివరించారు. ఈ ప్లాంట్ల ఏర్పాటు కోసం కావాల్సిన భూమిని అందించాలని రెవెన్యూశాఖ మంత్రిని కోరినట్లు గొట్టిపాటి రవికుమార్ తెలిపారు.ఆంధ్రప్రదేశ్‌లో 500 కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకు రిలయన్స్ సంస్థ.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. 65 వేల కోట్లు పెట్టుబడి పెట్టి 500 బయో గ్యాస్ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నారు. వీటి ద్వారా రెండున్నర లక్షల మందికి ఉపాధి అవకాశాలు దక్కుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. తొలి దశలో భాగంగా ప్రకాశం జిల్లా కనిగిరి, పల్నాడు జిల్లాలలో వీటిని ఏర్పాటు చేయనున్నట్లు తెలిసింది. రిలయన్స్ బయో ఎనర్జీ లిమిటెడ్ ద్వారా ఈ ఇంటిగ్రేటెడ్ కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నారు. కనిగిరిలో మొదటి ప్లాంటు ఏర్పాటు చేయనున్నట్లు తెలిసింది. కనిగిరిలో రిలయన్స్ బయో గ్యాస్ ప్లాంట్ ఏర్పాట కోసం 4000 ఎకరాల బంజరు భూమిని గుర్తించినట్లు తెలిసింది. ఈ నాలుగు వేల ఎకరాలను రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు లీజుకు ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం.బీడు భూములు అధికంగా ఉన్న నేపథ్యంలో కనిగిరి ప్రాంతాన్ని ఎంపిక చేసినట్లు సమాచారం. ఈ బంజరు భూముల్లో ఒక రకమైన గడ్డిని పెంచి.. ఆ గడ్డి ద్వారా బయో గ్యాస్ ఉత్పత్తి చేయనున్నారు. బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు కోసం సేకరించనున్న నాలుగు వేల ఎకరాల భూమిలో.. ప్రభుత్వ భూమికి అయితే ఎకరాకు ఏడాదికి 15 వేలు, ప్రైవేట్ భూమికి అయితే ఎకరాకు ఏడాదికి రూ.30వేలు చొప్పున కౌలు చెల్లించనున్నట్లు సమాచారం. వీలైనంత త్వరగా రైతులతో మాట్లాడి కౌలు ఒప్పందాలు పూర్తి చేయాలని అధికారులు ఆలోచిస్తున్నారు.

# ఆరు నెలల్లోనే ఫోరెన్సిక్ ల్యాబ్ పనులు 90 శాతం పూర్తి

గుంటూరు : రాజధాని అమరావతి నిర్మాణానికి ఏపీ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోంది. అమరావతికి కేంద్రం నుంచి సహకారం కూడా అందుతూ ఉండటంతో నిర్మాణ పనుల్లో వేగం పెరిగింది. అమరావతిలో వివిధ మౌలిక వసతుల నిర్మాణం కోసం ఇప్పటికే టెండర్లు కూడా ఆహ్వానించారు. త్వరలోనే వీటిని ఖరారు చేసి.. మార్చి 15 నుంచి పనులు ప్రారంభించనున్నారు. మరోవైపు అమరావతిలో మరో ప్రతిష్టాత్మక నిర్మాణం వేగంగా రూపుదిద్దుకుంటోంది. అమరావతిలో ఫోరెన్సిక్ ల్యాబొరేటరీ నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. ఫోరెన్సిక్ ల్యాబ్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని హోం మంత్రి వంగలపూడి అనిత ఎక్స్‌వేదికగా వెల్లడించారు.హోంమంత్రి క్యాంపు కార్యాలయంలో బుధవారం.. ఏపీ ఫోరెన్సిక్ ల్యాబ్ డైరెక్టర్ జి.పాలరాజు.. వంగలపూడి అనితను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అమరావతిలోని తుళ్లూరులో ఐదు ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్న ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ కార్యాలయం నిర్మాణ పనుల పురోగతిని హోం మంత్రికి వివరించారు. ఆరు నెలల్లోనే ఫోరెన్సిక్ ల్యాబ్ పనులు 90 శాతం పూర్తయ్యాయని.. ప్రయోగశాల పనులూ చురుగ్గా జరుగుతున్నాయని వివరించారు. ఈ విషయాన్ని హోం మంత్రి అనిత ఎక్స్ వేదికగా వెల్లడించారు. నేరస్థులను పట్టుకోవడంతో పాటుగా నేర నిరూపణలో శాస్త్రీయ ఆధారాల విశ్లేషణకు ఫోరెన్సిక్ ల్యాబ్ అనేది చాలా అవసరం. ఈ నేపథ్యంలోనే అమరావతిలో అంతర్జాతీయ స్థాయి ఫోరెన్సిక్ ల్యాబొరేటరీ నిర్మాణం ప్రారంభించారు. 2017 డిసెంబర్‌లో తుళ్లూరులో అప్పటి టీడీపీ ప్రభుత్వం హయాంలో దీనికి శంకుస్థాపన చేశారు. రూ.400 కోట్ల అంచనాతో ఫోరెన్సిక్ ల్యాబొరేటరీ ఏర్పాటుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా శంకుస్థాపన జరిగింది. అయితే 2019 ఎన్నికల్లో వైసీపీ విజయం సాధించడంతో అమరావతి ఫోరెన్సిక్ ల్యాబొరేటరీ నిర్మాణం ఆగిపోయింది. 2024 ఎన్నికల్లో విజయం అనంతరం టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ పనులను మళ్లీ ప్రారంభించారు. మొత్తం మూడు బ్లాక్‌లలో ఫోరెన్సిక్ ల్యాబొరేటరీ నిర్మాణం జరుగుతోంది. ప్రస్తుతం బ్లాక్ 1 నిర్మాణం పూర్తి కావొచ్చింది. రెండో బ్లాక్‌కు సంబంధించిన పిల్లర్ల పనులు జరుగుతున్నాయి. ట్రైనింగ్, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.



## ప్రమాదకరమైన డాంబర్ ప్లాంట్ తొలగించాలి

**వేద న్యూస్, శాయంపేట:**

ఎలాంటి పర్మిషన్ లేకుండా నడుపుతున్న డాంబర్ ప్లాంట్ ను తొలగించాలని ధర్మ సమాజ్ పార్టీ శాయంపేట మండల అధ్యక్షులు మల్యాల అమరేందర్ మహారాజు అన్నారు. ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా శాయంపేట మండలం ప్రగతి సింగారం గ్రామంలో ఎలాంటి పర్మిషన్ లేకుండా నడుపుతున్న డాంబర్ ప్లాంట్ ను శాయంపేట మండల అధ్యక్షులు మల్యాల అమరేందర్ మహారాజు పర్యటించారు. అనతరం వారు మాట్లాడుతు అధికారులు నిమ్మకు నీరు ఎత్తి నట్లు వ్యవహరిస్తున్నరు, పర్యావరణానికి హాని, ప్రజల ఆరోగ్యాలని హత్య చేసే ప్రమాదకరమైన డాంబర్ ప్లాంట్ని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్వో తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ వినతి పత్రం ఇచ్చి తగు చర్యలు తీసుకునే విధంగా ధర్మ సమాజ్ పార్టీ పోరాటం చేస్తుందని వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మధు, సతీష్, నాగరాజు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల వద్దకే తపాలా సేవలు



**వేద న్యూస్, శాయంపేట:**

ప్రజల వద్దకు పోస్ట్ ఆఫిస్ సేవల కార్యక్రమంలో భాగంగా పరకాల ఏఎస్పీ అనంత్ రామ్ నాయక్ శనివారం కొప్పుల, రాజక్కపల్లి, చెన్నాపూర్, చిన్నకోడేపాక గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆసరా పెన్షన్, ఉపాధి హామీ నగదు ను లబ్ధిదారులకు అందించారు. అలాగే నిస్సాహాయక పెన్షన్ దారులు కొండేటి సూరమ్మ కు ఇంటి వద్దకే వెళ్లి ఫించన్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోస్ట్ ఆఫిస్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే పోస్ట్ ఆఫిస్ ఇన్స్యూరెన్స్ సేవలలో భాగంగా కేవలం రూ .755 లకే రూ. 15లక్షల ప్రమాద భీమా సౌకర్యాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలని అని ఆయన కోరారు. తపాలా శాఖ మినీ ఏటీఎం సేవలను కూడా ప్రజలు సద్వియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు తపాలా సిబ్బంది సంతోష్,కృష్ణ, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## కళా మహెూత్సవానికి ఆర్టిస్ట్ మంజులకు ఆహ్వానం



**వేద న్యూస్, వరంగల్ టౌన్ :**

భారతీయ కళాకార్ సంఘ్ (జాతీయ ఆర్టిస్టు సంక్షేమ సంఘం) ఆధ్వర్యంలో ఓర్చ టౌన్ లో ఈ నెల 10,11,12 తేదీలలో మూడు రోజుల పాటు జరిగే కళా మహెూత్సవానికి సంఘ్ యొక్క తెలంగాణ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి గా నియమితులైన హన్మకొండ వాసి ప్రముఖ ఆర్టిస్ట్, సాగంటీస్ ఆర్ట్స్ అకాడమీ డైరెక్టర్ సాగంటి మంజుల కి ఆహ్వానం అందింది. ఈ మేరకు మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమానికి దేశంలోని అన్ని రాష్ట్రాల ఆర్టిస్టులు పాల్గొననున్నారు. ఆర్టిస్టుల సమస్యల మీద సమీక్ష, ఆర్ట్ ఎగ్జిబిషన్, పలు ప్రాంతాల సందర్శన లతో పాటు పలు కార్యక్రమాలు ఉంటాయని ఈ అవకాశం రావడం తనకు సంతోషాన్ని ఇచ్చిందని మంజుల తెలిపారు.



## ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

**వేద న్యూస్, మిర్యాలగూడ ప్రతినిధి :**

జనం కోసమే జనయేత్రి, జనంతోనే జనయేత్రి అనే నినాదంతో మరియు సేవా దృక్పథంతో ఏర్పాటు చేసే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జనయేత్రి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు,సామాజిక కార్యకర్త మునీర్ అహ్మద్ షరీఫ్ అన్నారు. ప్రతి నెల మొదటి తారీకు మిర్యాలగూడ పట్టణ మరియు పరిసర ప్రాంతాలలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరంలో భాగంగా శనివారం సీతారామపురంలో మాజీ కౌన్సిలర్ మల్గం రమేష్ సహకారంతో వైద్య శిభిరం నిర్వహించడం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతు జనయేత్రి ఫౌండేషన్ ద్వారా వైద్య శిబిరాలు నిర్వహించడమే కాకుండా అనేక సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ల్యాబ్ టెక్నీషియన్లు లక్ష్మణ్, శ్రీనివాస్ ,యాదగిరి, కృష్ణ సతీష్ నవీన్‌లు ఉచితంగా బీపీ, షుగర్ పరీక్షలను థైరాయిడ్ పరీక్షలను కేవలం రూ. 70కే నిర్వహించారు.ఫ్రెండ్స్ మెడికల్ హాల్ నిర్వాహకులు రషీద్ ఉచితంగా మందులు అందచేశారు. ఈ కార్యక్రమంలో సిరాజ్, కాంతా చారి,సంతోష్, అహ్మద్ సాహబ్, వెంకటేష్, గోపాలకృష్ణ, పరమేశ్వరి, రఫత్, శ్రీనివాస్, మణి, జనయేత్రి ఫౌండేషన్ కుటుంబ సభ్యులు షాహిర్, సీతారాం, రఫీ, రాజు, శ్రీనివాస్ రెడ్డి, రూహీన, సైదమ్మ, రుబీనా, లక్ష్మి ప్రసన్న ,రాజేశ్వరి, సురేష్ పాల్గొన్నారు.

# ప్రశాంతంగా శ్రీ రామలింగేశ్వర భూమి కౌలు వేలం

- **వేలంలో పాల్గొన్న 20 మంది రైతులు.**
- **వేలాన్ని దక్కించుకున్న ఏడుగురు రైతులు**

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**



నల్లగొండ జిల్లా వేములపల్లి మండల కేంద్రంలోని ప్రసిద్ధిగాంచిన శ్రీ పార్వతీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం భూములు కౌలు వేలంపాట శనివారం ఉదయం ప్రశాంతంగా ముగిశాయి. ఈ దేవాదాయ వేలం పాటలో 20 మంది రైతులు 5000 రూపాయలు డిపాజిట్ చేసి పాల్గొన్నారు. అందులో 7 గురు రైతులు దేవాలయ భూమి కౌలు వేలం పాటను దక్కించుకున్నారు. కౌలు వేలంను దక్కించుకున్న రైతులు సర్వే నెంబర్లు వారిగా 48లో5-02 ఎకరాల భూమిని ముండ్ల కళ్యాణ్ మెట్ట భూమిని 1 లక్ష 71,000 రూపాయలతో దక్కించుకున్నారు. సర్వే నెంబర్ 49లో 15-22 భూమిని కమిటీ సభ్యులకు వదిలేశారు. సర్వేనెంబర్ 108లో 3-09 మెట్ట భూమిని ముండ్ల శివ 55 వేల రూపాయలతో దక్కించుకున్నారు. సర్వేనెంబర్ 766లో 7-08 మెట్ట భూమిని వల్లంపట్ల వెంకన్న 70 వేల రూపాయలతో దక్కించుకున్నారు. సర్వే నెంబర్ 300 లో 2-20 వ్యవసాయ భూమిని నార్ల అజయ్ 33 వేల రూపాయలతో దక్కించుకున్నారు. సర్వేనెంబర్ 290లో 1-21 వ్యవసాయ భూమిని కోల పెద్ద సైదులు 20 వేల రూపాయలతో దక్కించుకున్నారు. సర్వేనెంబర్ 289 లో 1-31 వ్యవసాయ భూమిని పెరుమాండ్ల అమృతయ్య 41 వేల రూపాయలతో దక్కించుకున్నారు. అదేవిధంగా దేవాలయ టెంకాయ పాట నిర్వహించారు. టెంకాయ పాటలో ఇద్దరు పాల్గొనగా టెంకాయ పాటను నార్ల అజయ్ 50 వేల రూపాయలతో దక్కించుకున్నారు. ఈ సందర్భంగా దేవాలయ ఇంచార్జ్ మేనేజర్ మృత్యుంజయ శాస్త్రి మాట్లాడారు. దేవాలయ వేలం పాటకు సహకరించిన గ్రామ ప్రజలకు, రైతులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో దేవాలయ చైర్మన్ తాళ్ల వెంకటేశ్వర్లు, దేవాలయ ధర్మకర్తలు లొండ కలమ్మ, పెరుమాండ్ల జోజి,ముత్యాల యుగంధర్ వాకిటి బిక్షం, కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# అధునాతన టెక్నాలజీతో రివర్ హాస్పిటల్ సేవలు

**వేద న్యూస్, మిర్యాలగూడ ప్రతినిధి :**



మిర్యాలగూడ పట్టణంలో మునుపెన్నడూ లేని విధంగా అధునాతన టెక్నాలజీతో డాక్టర్ అంజిరెడ్డి రివర్ హాస్పిటల్ ను శనివారం రోజు ప్రారంభించడం జరిగింది. ఈ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే బిఎల్ ఆర్‌తో పాటు డిసిసి అధ్యక్షుడు శంకర్ నాయక్ మరియు ప్రముఖ వైద్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ గతంలో ఈ హాస్పిటల్ స్థానంలో ఉన్నటువంటి పాత రివర్ హాస్పటల్ ప్రజల యొక్క నమ్మకాన్ని వమ్ము చేసిందని, అలాకాకుండా ఇప్పుడు వచ్చినటువంటి డాక్టర్ అంజిరెడ్డి ఆధ్వర్యంలో అత్యాధునిక సేవలు, తక్కువ ఖర్చుతో అందిస్తూ మారుమూల పల్లెలకు ప్రజలకు కూడా నాణ్యమైన సేవలను అందించి మన మిర్యాలగూడకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. అనంతరం డిసిసి అధ్యక్షుడు శంకర్ నాయక్ మాట్లాడుతూ ఈ మిర్యాలగూడ చుట్టుపక్కల ప్రాంతంలో బడుగు, బలహీన వర్గాల ప్రజలు మాత్రమే జీవిస్తున్నారని వారికి అతి తక్కువ ఖర్చుతో వైద్యం అందించాలని, నమ్మకమైన వైద్యం అందిస్తే ఎల్లప్పుడూ మా సహాయ సహకారాలు మీకు ఉంటాయని అన్నారు.

అంజిరెడ్డి గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ మరియు విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ 1977 నుండి మా యొక్క సేవలు పల్నాడు ప్రాంతంలో అందిస్తున్నామని అప్పటి నుంచి ఇప్పటివరకు ఐదు బ్రాంచ్లు లలో నిరుపేదలకు వైద్యం అందిస్తూ మన్ననలు పొందామని, మిర్యాలగూడ నియోజకవర్గం లోని పేదలకు సేవ చేయడమే మా యొక్క హాస్పిటల్ ప్రధాన ఉద్దేశమని, నాణ్యమైన వైద్యంతో అతి తక్కువ ఖర్చుతో పేదలకు కార్డియాలజీ, న్యూరో సర్జరీ, గ్యాస్ట్రోఎంట్రాలజీ ,కోక్లియర్ ఇంప్లాంట్ లాంటి సూపర్ స్పెషాలిటీ వైద్యం తో పాటు ట్రామ క్రిటికల్ కేర్, జనరల్ మెడిసిన్,ఆర్థోపెడిక్, గైనకాలజీ, పీడియాట్రిక్స్, పల్మనాలజీ, ఇఎన్టి, రేడియాలజీ లాంటి స్పెషాలిటీ వైద్య సేవలు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రముఖ బోన్ మారో స్పెషలిస్ట్ డాక్టర్ పద్మజాలోకి రెడ్డి మాట్లాడుతూ గతంలో మాదిరిగానే ఈ యొక్క బ్రాంచ్ లో కూడా మంచి సేవలు అందిస్తూ ముందుకు పోవాలని అలాగే ప్రతి ఒక్కరూ డాక్టర్ కోర్స్ తో పాటు డాక్టర్ కు సహాయం అందించే స్టాఫ్ నర్స్, ఈసీజీ లాంటి టెక్నీషియన్ కోర్సులు కూడా నేర్చుకుంటే అందరికీ బాగుంటుందని అలాగే హాస్పిటల్ మేనేజ్మెంట్ కి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ వ్యవస్థాపకులు డాక్టర్ అంజిరెడ్డి, సుస్మ శ్రీనివాస్ రెడ్డి, హెచ్ఆర్ లు శ్రవణ్, సత్య, మార్కెటింగ్ మేనేజర్ విజయ్ లతోపాటు ఐఎంఏ డాక్టర్స్ అసోసియేషన్, రూరల్ మెడికల్ ప్రాక్టీషనర్ అసోసియేషన్, సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం, కెమిస్ట్ మరియు డ్రగ్గిస్టుల యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

# సుప్రీం తీర్పు అమరవీరుల త్యాగాల ఫలితమే..

- **ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అంకిల్ల రాజు మాదిగ**

**వేద న్యూస్, కమలాపూర్ :**



హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం చేసి అసువులు బాసిన మాదిగ అమరవీరులకు మార్చి నెల ఒకటవ తారీఖున మాదిగ అమరవీరుల దినోత్సవం జరుపుకునే సందర్భంగా ఎమ్మార్పీఎస్ కమలాపూర్ మండల శాఖ ఆధ్వర్యంలో ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి అంకిల్ల రాజు మాదిగ మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు, పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ కోసం గత 30 సంవత్సరాలుగా ఎన్నో పోరాటాలు చేశారని, ఈ పోరాటంలో ఎన్నో ఒడిదుడుకులు, ఇబ్బందులు, సమస్యలు ఎన్ని ఎదురైనప్పటికి తన ఆశయాన్ని మాత్రం పక్కకు పెట్టకుండా, ఎస్సీ వర్గీకరణతోనే మాదిగలకు, మాదిగ ఉపకులాలు అందరికీ న్యాయం జరుగుతుందని సంకల్పించి ముందడుగు వేశారని అన్నారు. ఇలా ఎన్నో సంవత్సరాల అలుపెరుగని పోరాటాల తదుపరి 2024 ఆగస్టు ఒకటో తారీఖున సుప్రీంకోర్టులో ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు రావడంతో ఆ తీర్పును స్వాగతిస్తూ ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాటం చేసి ఉద్యమంలో అసువులు బాసిన ఉద్యమ కెరటాలు మాదిగ అమరవీరులకు సుప్రీంకోర్టు ఇచ్చినటువంటి తీర్పు అంకితం చేస్తున్నట్లు తెలుపుతూ ప్రతి ఒక్కరూ మాదిగ అమరవీరుల ఆశయాలను కొనసాగించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎం ఎస్ పి జిల్లా ఉపాధ్యక్షులు చిలువేరు సంపత్ మాదిగ, ఎంఎస్పి జిల్లా కార్యదర్శి శనిగరపు రవీందర్ మాదిగ, ఎం ఎస్ పి జిల్లా నాయకులు మద్దునూరి ప్రసాద్ మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షులు ఇసంపెల్లి రమేష్ మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల కార్యదర్శి ఇసంపెల్లి చంద్రమౌళి మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల నాయకులు ప్రభాకర్ మాదిగ, పుల్ల శ్రీనివాస్ మాదిగ, అంకిల్ల రాజమల్లు మాదిగ, పెర్క శ్రీనివాస్ మాదిగ, అంబటి భూమయ్య, మాట్ల శంకర్ మాదిగ పాల్గొని మాదిగ అమరవీరులకు నివాళులర్పించారు.

# చారిత్రక వీరులను స్మరించటం ప్రతి భారతీయుడి బాధ్యత

- **తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య బాల కిష్టారెడ్డి**

**వేద న్యూస్, హైదరాబాద్ :**




ప్రజాక్షేమం కోసం అహర్నిశలు శ్రమించిన చారిత్రక వీరులను స్మరించటం, వారి త్యాగాలను గౌరవించడం ప్రతి భారతీయుడి బాధ్యత అని తెలంగాణ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య బాల కిష్టారెడ్డి అన్నారు. చరిత్ర విస్మరించిన యోధురాలు, లోకమాత అహల్యాబాయి హెూల్కర్ మూడువందల జయంతి వేడుకల సందర్భంగా సిటీ కాలేజీలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రపంచమంతా అత్యధిక యువజనులతో నిండి ఉన్న మన దేశంవైపు ఆసక్తిగా చూస్తున్నదని, సముద్ర రవాణా నుండి విమానయాన రంగం వరకు అనేక రంగాల్లో ఎన్నో అవకాశాలు ఉన్నా, అవసరమైన నైపుణ్యాలు లేకపోవటం వల్లనే ఇన్నాళ్ళు యువత నిరాశలో మునిగిందని అన్నారు. జాతీయ విద్యా విధానం 2020, విద్యా రంగంలో వచ్చిన డిజిటల్ విప్లవం, నైపుణ్య భారత్ తన సామర్థ్యాన్ని నిరూపించుకోనున్నదని, వచ్చే 15 సంవత్సరాల్లో భారత యువత తమ ప్రతిభతో ప్రపంచం ముంగిట కొత్త సవాళ్ళు ఉంచబోతున్నారని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

అనంతరం సదస్సులో ప్రధాన వక్తగా పాల్గొన్న అఖిల భారతీయ రాష్ట్రీయ సైక్షిక్ మహాసంఘ్ జాతీయ కార్యనివాహక కార్యదర్శి గుంతా లక్ష్మణ్ జీ మాట్లాడుతూ విద్యార్థులు చరిత్రను చదువుతూ, అందులోనే మిగిలిపోక, ఉత్తమ భవిష్యత్తుకోసం ప్రణాళికలు వేసుకోవాలని అన్నారు. వసుధైక కుటుంబ భావన ఉన్న భారతదేశ చరిత్రను అధ్యయనం చేసి చరిత్ర విస్మరించిన మహాయోధులను గురించి తెలుసుకోవాలని అన్నారు. స్ఫూర్తిదాయకమైన అహల్యాబాయి పాలనా విధానాలు, ఆమె చేసిన ప్రజోపయోగకరమైన కార్యక్రమాలను గురించి తెలుసుకోవాలని విద్యార్థులకు సూచించారు. సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన అహల్యాబాయి మూడు శతాబ్దాల పూర్వం పురుషులకు మాత్రమే పరిమితమైన రాజ్యాధికారాన్ని పొంది తన పాలనా కాలంలో అనేక సంస్కరణలు చేశారని, మాల్వా ప్రాంతంలో రైతుల కోసం సాగునీటి సౌకర్యాలు కల్పించారని అన్నారు. స్త్రీ విద్య, స్త్రీ సాధికారత కోసం అవిశ్రాంతంగా కృషి చేసిన పాలనాదక్షురాలు అహల్యాబాయి అని, తన రాజ్యంలో మౌలిక సదుపాయాల కల్పన కోసం కృషి చేయటమే కాక, దేశ వ్యాప్తంగా అనేక దేవాలయాల నిర్మాణం, పునరుద్ధరణ చేసిన వితరణశీలి అని కొనియాడారు.

సదస్సుకు అధ్యక్షత వహించిన కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య బాల భాస్కర్ మాట్లాడుతూ మూడు వందల యేళ్ళ క్రితం తన రాజనీతిజ్ఞతతో ప్రజారంజక పరిపాలన సాగించిన లోకమాత అహల్యాబాయి గురించి మూడువందల ఉన్నత విద్యాసంస్థలలో మూడు వందల గంటలపాటు ప్రత్యేక సదస్సులు నిర్వహించటం సముచితమైన గౌరవమన్నారు. ఈ సదస్సులో డా.ఆది రమేశ్, డా.కమల సుధారాణి, డా.తిరుపతి, డా.చిత్తరంజన్, డా.ఆనంద్, డా.నాగరాజు, డా.కృష్ణవేణి, డా.శ్రీదేవి పాల్గొన్నారు.



# తీన్మార్ మల్లన్న సస్పెండ్ ను ఖండిస్తున్నాం..

**వేద న్యూస్, వేములవాడ :**

తీన్మార్ మల్లన్న బీసీ కులగణన సర్వే ఆశాస్త్రీయంగా జరిగిందని, అందుకు సంబంధించిన అన్ని ఆధారాలతో ఎండగట్టినందుకు గాను మల్లన్నను కాంగ్రెస్ పార్టీ సస్పెండ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు కొండ దేవయ్య పటేల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీకి బీసీ ల మున్నూరు కాపుల ఓట్లు అవసరం లేదా అని ప్రశ్నించారు. ఇప్పటికే మా మున్నూరు కాపులకు జనాభా ప్రాతిపదికన మంత్రి వర్గంలో మాకు స్థానం లేదు. ఉన్న వారిని బయటకు పంపించే అతి పెద్ద కుట్ర జరుగుతుందని అన్నారు. కులగణన సర్వే లో బీసీ ల జనాభ తగ్గించినారన్నారు. దానిలో మున్నూరు కాపుల జనాభా 40 లక్షలు ఉంటే, 13 లక్షలు ఉన్నారని లెక్కలు చెబుతున్నారు. రాష్ట్రం లో రెడ్డి కులస్థుల సంఖ్య పెరిగిందనీ, రాష్ట్ర జనాభాలో 4 కోట్ల 20 లక్షలు ఉంటే, అందులో 40 లక్షల దాకా ఉన్నామనీ గుర్తు చేశారు. రాష్ట్ర జనాభాలో మూడున్నర శాతం కాదు మేము ఉంటే, రాష్ట్ర జనాభాలో 12 శాతము ఉన్నామన్నారు. ఈ రోజు మున్నూరు కాపులు తెలంగాణ రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉన్నారన్నారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం మమ్ములను 5 వ స్థానం లోకి నెట్టి వేసిందనీ, త్వరలో లక్షలాది మున్నూరు కాపులలో హైద్రాబాద్ లోని పరెడ్ గ్రౌండులో మున్నూరు కాపుల ఆత్మగౌరవ బహిరంగ సింహగర్జన జరుపాలని, అన్ని రాజకీయ పార్టీలలోనున్న కాంగ్రెస్, బీజేపీ,బి అర్ ఎస్ పార్టీలలో నున్న ప్రజా ప్రతినిధులు తీర్మానించారన్నారు. మున్నూరు కాపులకు ఫైనాన్స్ కార్పొరేషన్ ఇస్తామని వాగ్దానం చేసి, ప్రకటించి అధికారంలోకి రాగానే ఫైనాన్స్ కార్పొరేషన్ కాకుండా సొసైటీనీ మంజూరు చేసి కాపులను ఈ ప్రభుత్వం మోసము చేస్తుందనీ ఆగ్రహం వ్యక్తం చేశారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073